

## ఉగ్రదాడి అమానవీయ చర్య

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేయడం అమానవీయ చర్యని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల నుంచి కశ్మీర్ సందర్శనకు వచ్చిన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్యని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుని అండగా నిలవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్రాన్ని కోరారు. జమ్మూకశ్మీర్‌లో టెర్రరిస్టుల మారణకాండ పునరావృతం కాకుండా కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శోకతప్తులైన వారి కుటుంబీకులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉగ్రదాడిని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ఖండించారు.

## హేయమైన చర్య: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు చనిపోవడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పర్యాటకుల ప్రాణాలు తీయడం హేయమైన చర్య అని ఆయన అన్నారు. ఈ పాశవిక దాడిలో మృతి చెందిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలన్నారు. ఈ అమానుష దాడిలో ఆప్తులను కోల్పోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలువాలన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాద మూకలకు స్థానం లేదన్న సందేశాన్ని బలంగా ఇవ్వాలని కేటీఆర్ కేంద్రాన్ని కోరారు.

## ఉగ్రవాదంపై కలిసి పోరాడాలి: హరీశ్‌రావు

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రమూకలు పర్యాటకులను హతమార్చిన విషయం తెలిసి దిగ్భ్రాంతికి గురైనట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ ద్వారా తెలిపారు. ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరం కలిసికట్టుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## అమాయకులు బలి

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత**

జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎక్స్ ద్వారా తెలిపారు. ఉగ్రవాదులు అమాయకులైన పర్యాటకులను బలి తీసుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

## ఇంటి చిరునామాలు, బయోమెట్రిక్స్ ఇవ్వాల్సిందే

**హెచ్1బీ వీసాదారులను కోరుతున్న అమెరికా**

వాషింగ్టన్, ఏప్రిల్ 22: ఉద్యోగ నిమిత్తం అమెరికాలో ఉంటున్న హెచ్1బీ ఉద్యోగుల పట్ల ట్రంప్ సర్కార్ మరింత కఠిన వైఖరి అమలుజేస్తున్నది. ఉద్యోగుల ఇంటి చిరునామాలు, వారి బయోమెట్రిక్ వివరాలు ఇవ్వాల్సిందిగా అక్కడ పనిచేస్తున్న విదేశీయులు, అటార్నీలకు (యాజమాన్యాల తరపు న్యాయవాదులు) 'రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్'లు జారీ అవుతున్నాయి. యూఎస్ పౌరసత్వం, వలస సేవల విభాగం( యుఎస్‌సీఐఎస్) ఇంతకు ముందు ఈ వివరాలు అడగలేదు, ఇప్పుడు కొత్తగా ఇదంతా ఏంటి? అంటూ అటార్నీలు, విదేశీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'బయోమెట్రిక్, ఇంటి చిరునామాలు కోరటం.. అసాధారణ విషయం. ప్రతికూల సమాచారం ఎందుకు అన్నది యాజమాన్యాలు, అటార్నీలకు తెలపటం లేదు' అని ఫోర్బ్స్ వార్తా కథనం పేర్కొన్నది.

# ఉగ్ర ఘాతుకం

- సుమారు 26 మంది మృతి
- మరో 20 మందికి గాయాలు
- మృతుల్లో తెలంగాణ ఐబీ అధికారి మనీశ్ రంజన్
- పహల్గాం సమీపంలో ఘటన
- తమ పనేనన్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'
- దారుణానికి పాల్పడినవారిని వదిలిపెట్టబోం: ప్రధాని మోదీ

### జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు



ఉగ్రవాదులు దాడి చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సైనికాధికారులు, పోలీసులు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్ మళ్లీ నెత్తురోడింది. ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంతనాగ్ జిల్లా పహల్గాం పట్టణ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం పర్యాటకులే లక్ష్యంగా దాడికి తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహార యాత్రకు వచ్చిన వారిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగపడ్డారు. ఈ అమానవీయ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తెలంగాణ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి మనీశ్ రంజన్, ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. దాడికి తామే పాల్పడినట్టు ఉగ్రసంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది.

**విచక్షణారహితంగా కాల్పులు..**

ఫుడ్‌స్టాల్స్ వద్ద కొందరు, గుర్రాలపై స్వారీ చేస్తూ కొందరు, పచ్చిక బయలుపై కూర్చుని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ మరి కొందరు పర్యాటకులు ఉన్న సమయంలో అడవిలో నుంచి హఠాత్తుగా ప్రత్యక్షమైన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలు, పిల్లలను వదిలిపెట్టి కంటికి కనిపించిన పురుషులను కాల్చుకుంటూ పోయారు. ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాల్చవద్దని మహిళలు వేడుకుంటున్నా వారు కనికరించలేదు. ఇతను ముస్లిం కాదు.. కాల్చేయండి అని ఓ ఉగ్రవాది అన్నట్లు ప్రత్యక్ష సాక్షి తెలిపారు. భర్తను, ఆప్తులను కోల్పోయిన చాలా మంది మహిళలు సాయం కోసం స్థానికులను అర్థించే దృశ్యాలు వైరల్ అయ్యాయి. పోనీలు, ట్రెక్కింగ్ ద్వారా మాత్రమే ఆ ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉన్నందున క్షతగాత్రులను తరలించడానికి సైనిక హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. భద్రతా ఏర్పాట్ల మధ్య ఇతర పర్యాటకులను అక్కడి నుంచి



అధికారులు తరలించారు.

**మోదీకి పోయి చెప్పు**

పహల్గాం వద్ద ఉగ్రదాడిలో కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి మరణించారు. మంజునాథ్ రావు తనభార్య, చిన్న కుమారుడితో కలసి విహార యాత్ర నిమిత్తం బైసరన్ ప్రదేశాన్ని చేరుకున్నారు. అక్కడ సేదతీరుతున్న మంజునాథ్‌ను ఉగ్రవాదులు తుపాకీతో కాల్చిచంపారు. ఈ దారుణ ఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన మంజునాథ్ భార్య పల్లవి ఆ భయానక అనుభవాన్ని మీడియాకు వివరించారు. 'నేను, నా భర్త, నా చిన్న కుమారుడు కశ్మీరుకు వెళ్లాము. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మేము పహల్గాంలో ఉన్నాము. ముగ్గురు, నలుగురు సాయుధులు మాపైన దాడి చేశారు. నా భర్తపై కాల్పులు జరిపారు. ఆయన అక్కడికక్కడే మరణించారు. నా భర్తను చంపేశారు.. నన్ను కూడా చంపేయండి అని వారిని అర్థించాను. నిన్ను చంపము. ఈ విషయాన్ని మోదీకి చెప్పు అని వారిలో ఓ వ్యక్తి అన్నాడు' అని పల్లవి తెలిపారు.

**నా భర్తను కాపాడండి**

పహల్గాం సమీపంలోని బైసరన్ వద్ద పచ్చికబయళ్లు రక్తపుటేరుగా మారాయి. రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలు, వాటి వద్ద మహిళలు విలపిస్తున్న దృశ్యాలతో కూడిన వీడియోలు సోషల్ మీడియాను వణికించాయి. తన భర్త తలలో తూటా దిగిందని, ఆయనను కాపాడండి అంటూ ఓ మహిళ నిస్సహాయంగా అర్థిస్తున్న దృశ్యం ఓ వీడియోలో కనిపించింది. తాను భేల్‌పూరీ తింటుండగా ఓ సాయుధుడు తన భర్త వద్దకు తుపాకీతో కాల్చివేసినట్లు మరో మహిళ తెలిపింది. 'ఇతను ముస్లిం కాదు.. కాల్చివేయండి' అని ఆ ఉగ్రవాది అన్నాడని ఆ మహిళ వివరించడం మరో వీడియోలో కనిపించింది. మరో వీడియోలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి నేలపై పడి ఉన్న తన భర్తను లేపడానికి ప్రయత్నిస్తూ దయచేసి ఎవరైనా సాయం చేయండి అంటూ అర్థించడం కనిపించింది.

**శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా శ్రీనగర్‌కు చేరుకున్నారు. అంతకుముందు, సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి కశ్మీరులో కాల్పుల ఘటన సమాచారాన్ని అమిత్ షా తెలియజేశారు.

**ఈ అమానవీయ చర్య క్షమించరానిది: రాష్ట్రపతి ముర్ము**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం దిగ్భ్రాంతికరం, బాధాకరమైనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. అమాయకపు పౌరులను లక్ష్యంగా చేసుకుని చేసిన ఈ దుర్మార్గపు అమానవీయ చర్య క్షమించరానిదని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**వదలిపెట్టబోం: మోదీ**

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో తమ ఆప్తులను కోల్పోయిన వారికి ఆయన సంతాపాన్ని తెలియచేశారు. క్షతగాత్రులు త్వరితంగా కోలుకోవాలని సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. బాధితులకు అన్ని విధాలుగా సహాయం అందచేయడం జరుగుతోందని, ఈ దారుణానికి ఒడిగట్టినవారిని వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. వారి దుష్ట పన్నాగం ఎన్నటికీ నెరవేరదని, ఉగ్రవాదంపై తాము సాగిస్తున్న పోరాటం మరింత శక్తితో సాగుతుందని ఆయన తెలిపారు.



పహల్గాం ఉగ్రదాడి బాధితుడికి దవాఖానలో చికిత్స చేస్తున్న వైద్యులు

## పహల్గాం మృతుల్లో తెలంగాణ ఐబీ ఆఫీసర్

- ఫ్యామిలీతో టూర్‌కు వెళ్లిన సెక్షన్ ఆఫీసర్ మనీశ్ రంజన్
- ఐడీ కార్డు చూసి మరీ కిరాతకంగా కాల్చి చంపిన ముష్కరులు

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో చోటు చేసుకున్న ఉగ్రదాడిలో తెలంగాణలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) విభాగంలోని కంప్యూటర్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మనీశ్ రంజన్ మృతిచెందారు. ఇటీవల ఫ్యామిలీతో కశ్మీర్ టూర్ వెళ్లిన ఆయన్ను.. ముష్కరులు అత్యంత దారుణంగా కాల్చి చంపారు. ఐడీ చూసి మరీ 'నువ్వు ఐబీ ఆఫీసర్‌వు కదూ.. నిజం చెప్పు' అంటూ పాయింట్ బ్లాంక్‌లో కాల్చారని విశ్వసనీయ సమాచారం. కాగా, ఆధార్ కార్డు చూసి హైదరాబాద్ వాసిగా నిర్ధారించారు. మృతుడు మనీశ్ రంజన్‌ది బీహార్. భార్య, ఇద్దరు పిల్లలతో ఎల్‌టీసీపై టూర్‌కు వెళ్లారు. కాగా, కాల్పుల శబ్దం వినిపించిన వెంటనే వారిని దూరంగా పరిగెత్తమని మనీశ్ కోరినట్లు తెలిసింది. దీంతో కుటుంబసభ్యులు ప్రాణాలతో బయటపడ్డారు. హైదరాబాద్‌లోని ఐబీ ఆఫీసులో కంప్యూటర్ సెక్షన్ ఆఫీసర్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు.

## సైకలాజికల్ 'టెర్రర్' గేమ్!

- టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ రక్త చరిత్ర ఇది
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఆవిర్భావం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడులను తామే చేశామని ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) సంస్థ ప్రకటించుకొన్నది. 2019, ఆగస్టులో కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేసిన అనంతరం అదే ఏడాది అక్టోబర్‌లో ఈ సంస్థ ఏర్పాటైంది. హిజ్బుల్ ముజాహిదీన్, లష్కర్-ఏ-తాయిబాకు (ఎల్ఈటీ) చెందిన ఉగ్రవాద కమాండర్లు ఈ సంస్థను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఎల్ఈటీకి అనుబంధంగా టీఆర్ఎఫ్ ఉగ్ర కార్యకలాపాలను కొనసాగిస్తున్నది. టీఆర్ఎఫ్ సంస్థకు ఉగ్రవాది షేక్ సజ్జద్ గుల్ సుప్రీం కమాండర్‌గా వ్యవహరిస్తుండగా, మరో ఉగ్రవాది బాసిత్ అహ్మద్ దార్ చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా పని చేస్తున్నాడు.

**మైండ్ గేమ్‌తో ముగ్గులోకి..**

సోషల్‌మీడియా ద్వారా సైకలాజికల్ మైండ్ గేమ్ పోస్టులు, వీడియోలతో యువతను ప్రభావితం చేయడం టీఆర్ఎఫ్ సభ్యులకు వెన్నతో పెట్టిన విద్య. అలా బ్రెయిన్ వాష్ అయిన యువతతో ఉగ్ర కార్యకలాపాలను సాగిస్తూ.. ఉగ్ర దాడులకు స్కెచ్ వేయడం టీఆర్ఎఫ్ పని అంటూ భారత ప్రభుత్వం తెలిపింది. ఈ క్రమంలోనే 2023 జనవరిలో టీఆర్ఎఫ్‌ను నిషేధించింది.

**గతంలో దాడులు ఇలా..**

2024 అక్టోబర్‌లో గండేర్బాల్ జిల్లాలో, కుప్వారాలో 2020లో టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పలువురు మృతి చెందారు.

## దాడి గురించి ముందస్తు సమాచారం ఉన్నా..!

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి గురించి మన నిఘా సంస్థలకు ముందే సమాచారం ఉందా? అయినా వారు ఉదాసీనంగా వ్యవహరించారా? అంటే నిజమేనని సమాధానం వస్తున్నది. దక్షిణ కశ్మీర్ లక్ష్యంగా ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలకు సమాచారం ముందే అందింది. ముఖ్యంగా ప్రముఖ పర్యాటక కేంద్రాలపై దాడులు చేయాలని, కశ్మీరేతరులపై వారి మతాన్ని గుర్తించి దాడి చేయాలని ఉగ్రవాదులు భావిస్తున్నట్టు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ మేరకు భద్రతా దళాలను అప్రమత్తం చేశారు. అంతేకాకుండా ఈ కాల్పులకు ముందు ఈ ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో రెక్కీ కూడా నిర్వహించారు. ముగ్గురు నుంచి 5 మంది మాత్రమే ఉన్న ఈ ఉగ్రవాదులు భద్రతా దళాల కళ్లుగప్పి తమ ఆయుధాలను ఇక్కడకు తీసుకురావడంలో పూర్తిగా సఫలీకృతులయ్యారు. ఉగ్రదాడి గురించి తమకు ముందస్తు సమాచారం ఉన్నట్టు భద్రతా దళాలు దాడి అనంతరం వెల్లడించడం గమనార్హం. ముందే సమాచారం ఉన్నా అంత ఉదాసీనంగా ఎలా ఉన్నారు? పర్యాటకుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్క లేదా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## మినీ స్విట్జర్లాండ్.. 'బైసరాన్'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

*హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): స్విట్జర్లాండ్‌లోని పచ్చిక బయళ్ల మాదిరిగా ప్రకృతి అందాలతో కనుల విందు చేసే ఆకర్షణీయమైన గడ్డి మైదానాలు, మంచుతో కప్పబడిన పర్వత శిఖరాలు పహల్గాంలోని బైసరాన్‌లో ఉంటాయి. అందుకే దీన్ని 'మినీ స్విట్జర్లాండ్'గా కూడా పిలుస్తారు. ఏటా దాదాపు 12 లక్షల మంది యాత్రికులు ఈ ప్రాంతాన్ని పర్యటిస్తారని గణాంకాలు చెప్తున్నాయి. ఈ పర్యాటక ప్రాంతానికి గుర్రాలు, కాలినడకన మాత్రమే చేరుకోగలరు.*

## ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు

పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు, ఇతర టూరిస్టుల కోసం రోజంతా అందుబాటులో ఉండే విధంగా జమ్మూకశ్మీర్ ప్రభుత్వం హెల్ప్‌లైన్ డెస్క్‌ను తీసుకొచ్చింది. 'టూరిస్టులు 0193222337, 7780885759, 9697982527, 6006365245 ఫోన్ నంబర్లను సంప్రదించటం ద్వారా ప్రభుత్వ సాయం, ఇతర సమాచారాన్ని పొందవచ్చు. అనంత్‌నాగ్ జిల్లా అధికారులతో ఈ ఎమర్జెన్సీ హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశాం' అని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీనగర్‌లో ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, సాయం కోసం టూరిస్టులు 01942457543, 01942483651, 7006058623 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు.

**పాక్‌కు వ్యతిరేకంగా నిరసనలు**

పహల్గాం ఉగ్రదాడి ఘటనపై జమ్ముకశ్మీర్‌లో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జమ్ము నగరంలో, దోడా జిల్లాలో నిరసనలు చోటుచేసుకున్నాయి. జమ్ముకశ్మీర్ నుంచి ఉగ్రవాదుల్ని పూర్తిగా ఏరివేయాలని రాష్ట్రీయ బజ్‌రంగ్ దళ్ కార్యకర్తలు జమ్ములో ఆందోళనకు దిగారు.

## దేశంలో ప్రధాన ఉగ్రదాడులు ఇవీ..

- **ముంబై వరుస పేలుళ్లు**

**సంవత్సరం:** 1993
**బాధితులు:** 257 మంది మృతి, 1,400 మందికి పైగా గాయాలు
దాడులు చేసింది: దావూద్ ఇబ్రహీం డి-కంపెనీ

- **భారత పార్లమెంట్‌పై ఉగ్రదాడి**

**సంవత్సరం:** 2001
**బాధితులు:** 9 మంది మృతి, 18 మందికి గాయాలు
**దాడులు చేసింది:** జైషే మొహమ్మద్, లష్కర్-ఏ-తాయిబా

- **అక్షరధామ్ ఆలయంపై దాడి, గుజరాత్**

**సంవత్సరం:** 2002
**బాధితులు:** 33 మంది మృతి, 80 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** లష్కర్-ఎ-తాయిబా

- **ఢిల్లీ సీరియల్ బాంబు దాడులు**

**సంవత్సరం:** 2005
బాధితులు: 62 మంది మృతి, 210 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** లష్కర్-ఎ-తాయిబా

- **ముంబై ట్రైన్ బాంబ్ బ్లాస్ట్**

**సంవత్సరం:** 2006
**బాధితులు:** 209 మంది మృతి, 714 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** లష్కర్-ఎ-తాయిబా, స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా

- **గోకుల్ చాట్ బ్లాస్ట్, హైదరాబాద్**

**సంవత్సరం:** 2007
**బాధితులు:** 32 మంది మృతి, 47 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** ఇండియన్ ముజాహిదీన్

- **లుంబినీ పార్క్ బ్లాస్ట్, హైదరాబాద్**

**సంవత్సరం:** 2007
**బాధితులు:** 10 మంది మృతి, 50 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** ఇండియన్ ముజాహిదీన్

- **ముంబై ఉగ్ర దాడులు**

**సంవత్సరం:** 2008
**బాధితులు:** 173 మంది మృతి, 300 మందికి పైగా గాయాలు
దాడులు చేసింది: లష్కర్-ఏ-తాయిబా

- **దిల్‌షుఖ్‌నగర్ బ్లాస్ట్, హైదరాబాద్**

**సంవత్సరం:** 2013
**బాధితులు:** 17 మంది మృతి, 126 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** ఇండియన్ జాహిదీన్



పుల్వామా దాడి (ఫైల్)

### గడిచిన 11 ఏండ్లలో బీజేపీ ప్రభుత్వ హయాంలో ఉగ్ర దాడులు

- **ఉరి ఎటాక్స్, కశ్మీర్**

**సంవత్సరం:** 2016
**బాధితులు:** 19 మంది సైనికులకు అమరత్వం, 30 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** జైష్-ఎ-మొహమ్మద్

- **పుల్వామా దాడి, కశ్మీర్**

**సంవత్సరం:** 2019
**బాధితులు:** 40 మంది సైనికులకు అమరత్వం, 35 మందికి పైగా గాయాలు
**దాడులు చేసింది:** జైష్-ఎ-మొహమ్మద్

- స్పెషల్ టాస్క్ బ్యూరో, నమస్తే తెలంగాణ

## బిడ్డను కంటే 5 వేల డాలర్లు!

- తల్లులకు బేబీ బోనస్
- పన్ను రాయితీల పెంపు
- స్కాలర్‌షిప్‌లలో 30% కోటా
- జననాల రేటు పెంచేందుకు అమెరికా సర్కారు యోచన



*న్యూయార్క్, ఏప్రిల్ 22: దేశంలో ఏటికేడు పడిపోతున్న సంతానోత్పత్తి రేటుపై అమెరికా సర్కారు దృష్టి సారించినట్టు తెలుస్తున్నది. జనాభా పెరిగేలా పలు ప్రోత్సాహకాలు ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. పిల్లల్ని కనే తల్లులకు 5 వేల డాలర్ల (సుమారు రూ.4.25 లక్షలు) బేబీ బోనస్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. దాంతోపాటు చైల్డ్ ట్యాక్స్ క్రెడిట్ (పన్ను మినహాయింపులు) పెంపు, ఫెడరల్ ప్రభుత్వం సాయంతో ఇచ్చే ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం లాంటి వాటిలో పెండ్లి అయిన దంపతులు, పిల్లలున్న వారికి 30 శాతం రిజర్వేషన్ తదితర ప్రతిపాదనలు ఉన్నట్టు సమాచారం. అంతేకాదు, సంతానం సంబంధిత విషయాలపై అమెరికన్ మహిళలకు అవగాహన కల్పించడం లాంటి ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ ప్రతిపాదనలకు వైట్‌హౌజ్ అధికారికంగా ఆమోదం తెలపనప్పటికీ, సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తున్నది.*

***జేడీ వాన్స్, మస్క్ మద్దతు***

*అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఎలాన్ మస్క్ సహా ట్రంప్ ప్రభుత్వంలోని కీలక హోదాలో ఉన్నవారు జనాభా వృద్ధిపై మొదటి నుంచీ సానుకూలంగా ఉన్నారు. అమెరికాలో పడిపోతున్న సంతానోత్పత్తి రేటును నాగరికత సంక్షోభంగా వాన్స్ గతంలో అభివర్ణించారు. ముగ్గురు పిల్లల తండ్రి అయిన వాన్స్.. ప్రభుత్వ కార్యక్రమాల్లో పిల్లలతో కలిసి పాల్గొంటుంటారు. ఇక, జనాభా పెరుగుదలకు 14 మంది పిల్లలకు తండ్రి అయిన మస్క్ బహిరంగంగానే మద్దతు తెలుపుతుంటారు.*

***ప్రోత్సాహకాలతో జనాభా పెరిగేనా?***

*1990ల నుంచి అమెరికాలో సంతానోత్పత్తి రేటు క్రమంగా పడిపోతున్నది. అమెరికా దేశ సంతానోత్పత్తి రేటు ఒక మహిళకు 1.62 మాత్రమే. జీవన వ్యయాలు భారీగా పెరగడం, శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం ఎక్కువ కావడం లాంటి కారణాల వల్ల సంతానోత్పత్తి రేటు తగ్గిపోయినట్టు దేశంలోని నిపుణులు చెబుతున్నారు.*

## పార్లమెంటే సుప్రీం

**ప్రజా ప్రతినిధులను ఎవరూ శాసించలేరు ▪ సుప్రీంపై మరోసారి ధన్‌ఖడ్ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రభుత్వ విధి నిర్వహణలో సుప్రీంకోర్టు జోక్యాన్ని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మరోసారి ప్రశ్నించారు. పార్లమెంటే సుప్రీం అని ప్రకటించిన ఆయన.. ప్రజా ప్రతినిధులే (పార్లమెంట్ సభ్యులు) రాజ్యాంగ పరిరక్షకులని, వారిని శాసించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న తాను మాట్లాడే ప్రతి మాట దేశ ప్రయోజనాలను ఆశించేనని చెప్పారు. తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు.

**ఎమర్జెన్సీలో మీ పాత్ర ఏమిటి?**

రాజ్యాంగ పీఠికకు సంబంధించి గతంలో ఇచ్చిన రెండు పరస్పర భిన్నమైన తీర్పులపై



సుప్రీంకోర్టుపై ఎదురైన బహిరంగ విమర్శలను ధన్‌ఖడ్ ప్రస్తావించారు. 1967లో ఐసీ గోలక్‌నాథ్ కేసు, 1973లో కేశవానంద భారతి కేసును ఆయన గుర్తు చేస్తూ 1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెనీ విధించిన సందర్భంగా ఆనాటి సుప్రీంకోర్టు పాత్రను కూడా ప్రశ్నించారు. ఎమర్జెన్సీ విధింపుపై తొమ్మిది హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన చెప్పారు. ఎమర్జెన్సీని, ప్రాథమిక హక్కుల రద్దును ప్రజస్వామిక చరిత్రలో చీకటి దశగా ఆయన అభివర్ణించారు. తొమ్మిది హైకోర్టులు ఇచ్చిన తీర్పులను దేశంలోని అత్యున్నత న్యాయస్థానం విస్మరించినందుకే తాను చీకటి దశగా పేర్కొన్నానని ఆయన చెప్పారు. ప్రాథమిక హక్కుల నిలుపుదల జరిగినపుడు దాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని ఉప రాష్ట్రపతి తెలిపారు. ఎమర్జెన్సీ విధించిన అప్పటి ప్రధాన మంత్రిని(ఇందిరా గాంధీని ప్రస్తావిస్తూ) 1977లో జవాబుదారీ చేశారని, ఆ తర్వాత ఎన్నికల్లో ఆమె ఓడిపోయారని ఆయన చెప్పారు. ప్రజల కోసమే రాజ్యాంగం ఉందని, దాన్ని పరిరక్షించే బాధ్యత పార్లమెంట్‌కే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.